క్లుప్తంగా

ఉపాధి పనుల పరిశీలన



పనుల వద్ద మస్టర్ తనిఖీ చేస్తున్న ఎంపీడీఓ

రొద్దం: మండలంలోని దండేపల్లి, రొద్దం గ్రామాల వద్ద జరుగుతున్న గ్రామీణ ఉపాధి పనులను ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ సోమవారం పరిశీలించారు. కూలీల సంఖ్య, మస్టర్‌లో నమోదు చేసిన పేర్లను పరిశీలించారు. మస్టర్‌లో ఏమైనా పనులకు రాని వారి పేర్లు ఉన్నాయా? అన్న విషయాన్ని ఆరాతీశారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం: విద్యార్థులు స్కూల్ వెళ్లడానికి ఆసక్తి చూపేలా పిల్లలను ప్రోత్సహించాలని సీడీపీఓ రమణమ్మ అన్నారు. కొటిపి పంచాయతీలోని బసవేశ్వరకాలనీలో అంగన్‌వాడీ కేంద్రంలోని విద్యార్థులకు సోమవారం గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ మూడేళ్లు పూర్తయిన అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు విద్యపట్ల ఆసక్తి కనపరిచేలా వారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరస్వతీ, గ్రామపెద్దలు రవి, వెంకటేశప్ప, అంగన్‌వాడీ కార్యకర్తలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆగస్టు 1 నుంచి గురుపూజ సంగీత ఉత్సవం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న సేవా సమితి సభ్యులు

హిందూపురం టౌన్: శ్రీక్షేత్రం కైవారం యోగినారాయణ తాత గురుపూజ సంగీత ఉత్సవాల సందర్భంగా యోగినారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం ప్రచారం రథం ప్రారంభించారు. ఆగస్టు 1 నుంచి మూడు రోజుల పాటు జరిగే గురుపూజ సంగీత ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. 72 గంటల పాటు సంగీత విద్వాంసులచే సంగీత ఉత్సావం జరగనుందన్నారు. ఆ కార్యక్రమం పోస్టర్లు, కరపత్రాలతో ప్రచార రథంతో కేవీఆర్ ఫంక్షన్ హాల్ నుంచి ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో సేవా సమితి అధ్యక్షుడు రవిశంకర్, రాము,నాగరాజు, బసప్ప, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సద్దుమణిగిన వివాదం

- ప్రభుత్వ స్థలంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు ఇరువర్గాల అంగీకారం



ఇరువర్గాలతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీఓ, సీఐ, ఎస్‌ఐ తదితరులు

పరిగి: మండలంలోని ఎర్రగుంటలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుపై నెలకొన్న వివాదం ఎట్టకేలకు పరిష్కారమైంది. గ్రామంలో ఆటో స్టాండు వద్ద ఉన్న స్థలంలో విగ్రహ ఏర్పాటుకు గతంలోనే ఓ వర్గానికి చెందిన ఎస్సీ కాలనీ వాసులు నిర్మాణ పనులు చేపట్టారు. అయితే అదే గ్రామానికి చెందిన ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటి పరిధిలో ఉన్న స్థలంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయకూడదని విభేదించారు. ఈక్రమంలో ఆదివారం దళిత సంఘాలు, ఎమ్మార్పీఎస్ నేతలు ఎర్రగుంటకు వివాద స్థలాన్ని పరిశీలించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారకుండా అధికారులు ముందస్తు చర్యలను చేపట్టారు. సోమవారం పరిగి మండల అధికారులు తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, ఎంపీడీఓ సరస్వతి, పెనుకొండ రూరల్ సీఐ కరుణాకర్, ఎస్‌ఐలు నరేంద్ర, నాగస్వామి ఎర్రగుంటకు వెళ్లారు. ఇరు వర్గాలను పిలిపించి, సమస్య పరిష్కారంపై చర్చించారు. ఇరు వర్గాల నేతలతో మాట్లాడిన అనంతరం గ్రామంలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు చేసుకోవాలని, దీనికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇవ్వడంతో ఇరువర్గాల వారు అంగీకరించారు.

ప్రతిభకు పట్టం

- వేడుకగా 'జగనన్న ఆణిముత్యాలు'
- పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన వారికి అవార్డుల ప్రదానం
- విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



రొళ్ల: దొమ్మరహట్టి రెసిడెన్షియల్ పాఠశాలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి



పెనుకొండ: విద్యార్థులకు పురస్కారాలు అందజేస్తున్న నగర పంచాయతీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్



హిందూపురం: విద్యార్థులకు విద్యాకానుకలు అందజేస్తున్న చైర్‌పర్సన్ ఇంద్రజ

అమరాపురం: విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. విద్యార్థులను ప్రోత్సహించడానికే ప్రభుత్వం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా అవార్డులను అందిస్తోందని పేర్కొన్నారు. మండల పరిధిలోని హలుకూరు సమీపంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ప్రిన్సిపాల్ పద్మావతి అధ్యక్షతన పాఠశాలస్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ఎమ్మెల్యే తిప్పేస్వామి అవార్డులను ప్రదానం చేశారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ విద్యారంగంలో తీసుకొచ్చిన అనేక మార్పుల వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందన్నారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన, జగనన్న గోరుముద్ద తదితర కార్యక్రమాలతో పేద విద్యార్థుల చదువు ఎలాంటి ఆటంకం లేకుండా ముందుకు సాగుతున్నాయన్నారు. మడకశిర నియోజవర్గంలోని రొళ్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఐశ్వర్య .. పాఠశాల, నియోజవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయి ఆణిముత్యాలు కార్యక్రమంలో ప్రథమ బహుమతి తీసుకోవడం హర్షణీయమన్నారు. ఎంపీపీ ఈరన్న, వైస్ ఎంపీపీ కృష్ణమూర్తి, సింగిల్‌విండో అధ్యక్షుడు చిక్కన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, ఎంపీడీఓ మునిస్వామి, తహసీల్దార్ గురుబ్రహ్మ, ఎస్ఐ.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ పద్మావతి, పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ వసంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని దొమ్మరహట్టి వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమాన్ని నిర్వహించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎమ్మెల్యే తిప్పేస్వామి ప్రశంసాపత్రాలతో పాటు అవార్డులు అందించి సన్మానించారు. మండల వ్యాప్తంగా ఉన్న 8 ఉన్నత పాఠశాలతో పాటు కేజీబీవీ, బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులను అందించారు. మార్కెట్ యార్డు చైర్మన్ జయరామప్ప, సింగిల్ విండో అధ్యక్షుడు మోతిరాంనాయక్, మార్కెట్ యార్డు డైరెక్టర్ శ్రీనివాస్, కోఆప్షన్ మెంబర్లు అల్లాబకాష్, నసీర్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ మైలారప్ప, ఎంఈఓ శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు నగేష్‌రంగారెడ్డి, రవికుమార్, సిద్దరామప్ప, నాగేంద్ర, గోవిందప్ప, కామరాజు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: మండలంలో ఉన్న అన్ని ఉన్నత పాఠశాలల్లో సోమవారం పాఠశాల స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. టెన్త్‌లో పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు, గోల్డ్ మోడల్‌తో పాటు నగదు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు ,విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ: పట్టణంలోని ఉర్దూ ఉన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జరిగింది. పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు అప్సానాకు రూ. 3 వేలు, అఫ్రీన్‌కు రూ. 2 వేలు, ఫైజాన్‌కు రూ. వెయ్యి చొప్పన అందజేశారు. ఈ సందర్భంగా నగర పంచాయితీ చైర్మన్ ఉమర్‌ఫారూక్‌ఖాన్ మాట్లాడుతూ విద్య కోసం సీఎం జగన్ రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారని ఆయన నమ్మకాన్ని విద్యార్థులంతా నిలబెట్టాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గోవిందరావు, వైస్ చైర్మన్ సునీల్, కౌన్సిలర్లు ఫర్జియాభాను, రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బోయ నరసింహ, కోఆప్షన్ మెంబర్లు నేమతుల్లా, ముహీబా, సద్దాం, శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: ఉన్నత చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని గుడిబండ హెచ్‌ఎమ్ రవిచంద్రకుమార్ తెలిపారు. సోమవారం మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతిలో ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ప్రశంసాపత్రం, మెడల్స్‌తో పాటు నగదు బహుమతులను అందజేశారు.

హిందూపురం: విద్యతోనే బంగారు భవిష్యత్తు సాధ్యమని, ప్రతి విద్యార్థి చదువును నిర్లక్ష్యం చేయకుండా చదువుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. పట్టణంలోని 31వవార్డు మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో కౌన్సిలర్ చిన్నమ్మ అధ్యక్షతన సోమవారం జగనన్న విద్యాకానుక, ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యాకానుకతో పాటు పదో తరగతిలో టాపర్లకు అవార్డులతో పాటు నగదు పురస్కారాలను మున్సిపల్ చైర్‌పర్సన్ చేతుల మీదుగా అందజేశారు. మరోవైపు స్థానిక 12వ వార్డులోని ఉర్దూ పాఠశాలలో కౌన్సిలర్ రహమత్‌బీ అధ్యక్షతన విద్యార్థులకు విద్యా కానుకతో పాటు రాగిజావ గ్లాసులు, విద్యాకిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, వార్డు కన్వీనరు జబీఅస్మసర్ధార్, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం: పట్టణంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈఓ గంగప్ప చేతుల మీదుగా పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన ప్రమీళ, హితన్యా, హిమబిందులను సన్మానించి నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రమీళ, హితన్యా జిల్లా స్థాయిలో టాపర్లుగా నిలవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగమణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ముద్దిరెడ్డిపల్లిలోని మున్సిపల్ గర్ల్స్ హైస్కూల్‌ల్లోనూ జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్కూల్ టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులను సన్మానించారు.

పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టురూ హైస్కూల్‌లో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం జరిగింది. పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఖుషిత, మంజుల, సాదియాలకు అవార్డులతో పాటు నగదు ప్రోత్సాహకాన్ని జెడ్పీటీసీ సభ్యులు శ్రీరాములు చేతుల మీదగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగార్జునుడు, ఎంపీటీసీ నిర్మల, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నజీర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

పరిగి: విద్యార్థుల మేధాశక్తిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో పోటీతత్వం పెరిగి మంచి మార్కులు సాధించేందుకు దోహదపడుతుందని కొడిగెనహళ్లి ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపల్ కరీం తెలిపారు. సోమవారం స్థానిక పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన ఎస్ బాబుల్లా, మనీష , శివమ్మకు అవార్డులు, నగదు ప్రోత్సాహాలను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొయి వెంకటేశ్వరరావు, కలకండ వెంకటేశ్వరరావు, మేరీ మంజుల, అపర్ణ, రాజేశ్వరీ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండలంలోని నాయనిపల్లి క్రాస్ సమీపంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల (నాబార్డు)లో సోమవారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. పదో తరగతిలో టాపర్లుగా నిలిచిన జే.ఉమేష్ , ఎస్.మహేష్, హెచ్.సంతోష్ కుమార్‌కు నగదుతో పాటు అవార్డులు అందజేశారు. ప్రిన్సిపాల్ మధుసుదన్ రావు, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగు, సాగునీటికి ప్రాధాన్యం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర నారాయణ

సోమందేపల్లి: తాగు, సాగు నీటికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ తెలిపారు. వైఎస్సార్ సుజల స్రవంతి పథకం ద్వారా మండలంలోని పందిపర్తి గ్రామంలో రూ.3.54 కోట్లతో నిర్మించిన శుద్ధ జలం మదర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి ఇప్పటికే నియోజకవర్గంలో హంద్రీనీవా కాలువ ద్వారా చెరువులకు సాగునీటిని విడుదల చేశామన్నారు. ప్రజల ఆరోగ్యం దృష్ట్యా సురక్షిత నీటిని అందించడానికి వైఎస్సార్ సుజల స్రవంతి ద్వారా ప్లాంట్లు నిర్మించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్రమ్మ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజురావు, ఎంపీడీఓ సునందమ్మ, కో ఆప్షన్ సభ్యుడు రఫీక్, ఎస్సీసెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే తిప్పేస్వామి



గొడనకుంటలో సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

అమరాపురం: 'కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయి. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు అందజేస్తున్నారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఆశీర్వదిస్తే ప్రజలకు మరింత మంచి చేస్తారు' అని ఎమ్మెల్యే తిప్పేస్వామి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తమ్మడేపల్లి - 2 గ్రామ సచివాలయం పరిధిలోని గొడనకుంట గ్రామంలోని బీసీ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పేస్వామి ఇంటింటికీ వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తూనే స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. గొడనకుంట చెరువులో నీరు చేరితే పైతట్టు ప్రాంతాలకు వెళ్లడానికి ఇబ్బంది కలుగుతుందని, రోడ్డును ఎత్తు చేయించాలని, అమరాపురం నుంచి విరుపసముద్రం వరకూ తారు రోడ్డు త్వరగా పూర్తి చేయాలని స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమంలో రాష్ట్ర కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, డైరెక్టర్లు వీరక్యాతరాయ, లక్ష్మీదేవి, సర్పంచ్ గిరిజమ్మ, వైస్.ఎంపీపీ లలితమ్మ, కృష్ణమూర్తి, ఎంపీపీ ఈరన్న, జెడ్పీటీసీ సభ్యురాలు స్వారక్క, స్థానిక నాయకులు శివకుమార్, రంజిత్‌కుమార్, సదానందగౌడ, రామచంద్రప్ప, నారాయణ, ప్రసాద్, జేకే.మూర్తి, పీఆర్.మూర్తి త్రిలోక్‌నాథ్, ఎంపీడీఓ మునిస్వామి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ గురుబ్రహ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- సబ్ కలెక్టర్ కార్తీక్



డివిజన్ స్థాయి స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ కార్తీక్

సోమందేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'స్పందన' కార్యక్రమానికి వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించేందుకు కృషి చేయాలని సబ్ కలెక్ట కార్తిక్ అధికారులను ఆదేశించారు. సోమందేపల్లిలోని వైకేపీ కార్యాలయంలో సోమవారం డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. భూ సమస్యలు, పింఛన్లు, వ్యవసాయం తదితర శాఖలకు సంబంధించి 90 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

కొన్ని అర్జీలు ఇలా...

- ఈ నెల 12న పెనుకొండలో షాఫియా (4) అదృశ్యమైందని, ఇప్పటికీ ఆచూకీ లభించలేదు తమకు న్యాయం చేయాలంటూ చిన్నారి తండ్రి ఖలీల్ అర్జీ అందజేశారు.
- సదరమ్ సర్టిఫికెట్ ఇప్పించాలంటూ సోమందేపల్లిలోని వినాయక్‌నగర్‌కు చెందిన రామాంజి దివ్యాంగుడు అర్జీ ఇచ్చారు.
- స్థానిక నక్కల గుట్టకాలనీలోని హై కోర్టు పరిధిలో స్టేస్‌కో ఆర్డస్ ఉన్న స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, న్యాయం చేయాలని బాధితులు ఫిర్యాదు చేశారు.
- సోమందేపల్లి మండలంలో నకిలీ వేరుశనగ విత్తనాలను రైతులకు సరఫరా చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్టీఐ కార్యాకర్త బాబుప్రసాద్ సబ్ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజురావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

పరిగి: మండలంలోని సేవామందిరం కూడలిలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న గంగాధర్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. 20 కర్ణాటక మద్యం పాకెట్లు స్వాధీనం చేసుకొని, నిందితుడిని హిందూపురం కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించామన్నారు.

న్యాయం చేయండయ్యా..

పెనుకొండ: తనకు న్యాయం చేయాలంటూ తిమ్మాపురానికి చెందిన పాత్రికేయుడు గణేష్ సబ్‌కలెక్టర్ కార్తీక్‌కు విన్నవించారు. సోమందేపల్లి మండల కేంద్రంలో సోమవారం జరిగిన స్పందనలో వినతిపత్రం అందించారు. తిమ్మాపురంలో రెవెన్యూ అధికారులు ఇంటి పట్టా ఇవ్వగా.. ప్రస్తుతం కొందరు వ్యక్తులు స్థలంలోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన సబ్‌కలెక్టర్ పాత్రికేయుడికి న్యాయం చేయాలని, దీనిపై విచారణ చేపట్టాలంటూ పెనుకొండ తహసీల్దార్ స్వర్ణలతను ఆదేశించారు.

రైతుకు తీవ్ర గాయాలు

పావగడ: తిరుమణి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుగడూరు గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయచర్లుకు చెందిన నాగభూషణ అనే రైతు తీవ్రగాయాలయ్యాయి. ద్విచక్ర వాహనాలు పరస్పరం ఢీ కొనడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. తీవ్రంగా గాయపడిన రైతు నాగభూషణను చికిత్స నిమిత్తం బెంగళూరు తరలించారు.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

హిందూపురం: పట్టణ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ సూచించారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో టీపీఓ, శానిటరీ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు, సలహాలిచ్చారు.



నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల: మండల పరిధిలోని కమ్మవారిపల్లి పంచాయతీలోని ఎమకలగుట్టపల్లి, యర్రయ్యగారిపల్లి, చొండూరివాండ్లపల్లిలో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప తెలిపారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో ఎమకలగుట్టపల్లిలో ఉదయం 7 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

పేదల పెన్నిధి ఫాదర్ ఫెర్రర్



పి.రొప్పాలలో ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

రొద్దం: మండల పరిధిలోని పి.రొప్పాలలో సోమవారం ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ వర్ధంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు మూర్తి మాట్లాడుతూ ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ పేదల పెన్నిధి అని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్డీటీ కమ్యూనిటీ కోఆర్డినేటర్ సరోజ, ఆర్డీటీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మడకశిరరూరల్: ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షించుకుందామని ఆర్డీటీ సంస్థ ఆర్డీ మల్లికార్జున, సర్పంచ్ గీత తెలిపారు. సోమవారం ఫాదర్ ఫెర్రర్ వర్ధంతి సందర్భంగా గ్రామాల్లో ఫెర్రర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఏఆర్ రొప్పంలో మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. తర్వాత కొబ్బరి మొక్కలను పంపిణీ చేశారు. ఏటీఎల్ సుదర్శన్‌రెడ్డి, ఆర్డీటీ సిబ్బంది, సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షపై అవగాహన కల్పించాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ సరస్వతి

పరిగి: జగనన్న సురక్ష పథకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులు తెలిపారు. జగనన్న సురక్షపై సోమవారం సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి ప్రసాద్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దారు సౌజన్యలక్ష్మీ, ఎంపీడీఓ సరస్వతి పాల్గొని పలు సూచనలు, సలహాలిచ్చారు. జూలై 1 నుంచి 28 వరకూ ప్రతి గ్రామ పంచాయతీ కేంద్రంలో అధికారులు పర్యటించనున్నట్లు పేర్కొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పావగడ: వైఎన్ హొసకోట పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగలాపుర గ్రామం దగ్గర పేకాట ఆడుతున్న ఆరుగురిని పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ అర్జున్‌గౌడ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5100 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.





సంక్షిప్త సమాచారం

సమస్యలు పరిష్కరించాలని వినతి

మడకశిర: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మడకశిరలో సోమవారం రాత్రి ఉపాధ్యాయులు స్థానిక ఎమ్మెల్యే తిప్పేస్వామికి వినతిపత్రం అందించారు. ఫ్యాప్టో (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య) జిల్లా సెక్రటరీ జనరల్ రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ వినతి పత్రాన్ని అందించారు.

వ్యక్తికి గాయాలు

రొళ్ల: కొడగార్లగుట్ట గ్రామ సమీపాన జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తాడిమర్రి మండలం చలకొండపల్లికి చెందిన రంగయ్య అనే వ్యక్తి గాయపడ్డారు. అగళి పట్టణ సమీపంలోని మోడల్ పాఠశాల్లో కుమారుడిని చేర్పించేందుకు బైక్‌పై వెళ్తున్నారు. రొళ్ల వైపు నుంచి ఇనగలూరు చెందిన రాజప్ప అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో వస్తున్నారు. రెండు వాహనాలు కొడగార్లగుట్ట వద్ద ఢీకొన్నాయి. గాయపడిన రంగయ్యను మడకశిర ఆస్పత్రికి తరలించారు.

ఇరు వర్గాల ఘర్షణ

రొద్దం: మండల కేంద్రంలోని సచివాలయం-3 ఎదురుగా ఉన్న ఓ స్థలం విషయంలో ఇరు వర్గాలు తహసీల్దార్ కార్యాలయంలోనే ఘర్షణ పడ్డారు. మండల కేంద్రానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన జిలాన్, బాషా కుటుంబ సభ్యులు సోమవారం స్పందన కార్యక్రమానికి వెళ్లారు. 99 సెంట్లకు సంబంధించి వీరి మధ్య కొద్దిరోజులుగా వివాదం నెలకొంది. అయితే మాటా మాటా పెరగడంతో ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. ఆఖరికి అక్కడే ఉన్న అధికారులు సర్దిచెప్పి వివాదాస్పద స్థలాన్ని సర్వే చేయడానికి వెళ్లారు.

ప్రిన్సిపాల్ నీలంకు నివాళి

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం దివంగత ప్రిన్సిపాల్ నీలం రమేష్ రెడ్డి చిత్రపటం వద్ద అధ్యాపకులు, విద్యార్థులు నివాళులర్పించారు. ఆయన కళాశాల అభ్యున్నతికి చేసిన సేవలను కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, ప్రతాప్, శ్రీదేవి, రంగనాయకులు, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శనీశ్వరాలయాన్ని మరోచోటికి మార్చండి

పావగడ: స్థానిక పురాతన శనీశ్వర దేవాలయాన్ని మరోచోటికి మార్చి నూతనంగా ఆలయాన్ని నిర్మించాలని శ్రీనివాసపురానికి చెందిన సమాజ సేవకుడు శ్రీనివాసబాబు కోరారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక తహసీల్దార్ సుజాతకు సోమవారం వినతి పత్రం అందించారు.